క్లుప్తంగా

నేడు మంత్రి శ్రీధర్‌బాబు రాక

రామగిరి: మండల కేంద్రంలో గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటించనున్నారు. సెంటినరీకాలనీ సీఎస్‌సీవోఏ క్లబ్‌లో, బిట్టుపల్లి ఆర్‌అండ్‌ఆర్ కేంద్రంలో అక్కెపల్లి గ్రామస్తులకు ఏర్పాటు చేసిన వసతులను ప్రారంభించనున్నట్లు ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు తెలిపారు.

మల్లికార్జునస్వామికి ప్రభుత్వ విప్ పూజలు



ధర్మారం: నర్సింహులపల్లి, చింతలపల్లి మల్లికార్జునస్వామి ఆలయాల్లో నిర్వహిస్తున్న మల్లన్న పట్నాలకు బుధవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై, పూజలు చేశారు. నర్సింహులపల్లిలో ఆయనను ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మ మల్లయ్య, సభ్యులు సన్మానించారు. మాజీ ఎంపీపీ కొడారి అంజన్న, కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, లావుడ్య రూప్లానాయక్, తాళ్లపెల్లి లింగయ్య, నార మల్లయ్య, యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

త్రిలింగేశ్వర స్వామివారిని దర్శించాలి



గోదావరిఖనిటౌన్: జనగామ శ్రీ త్రిలింగేశ్వర స్వామివారిని ప్రజలు దర్శించాలని రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ అన్నారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ జనగామ నారాయణ, కార్పొరేటర్లు జనగామ కవిత సరోజిని, శ్రీనివాస్ తదితరులున్నారు.

వేములవాడకు కార్మికులు



కోల్‌సిటీ: మహాశివరాత్రి నేపథ్యంలో వేములవాడలో పారిశుధ్య నిర్వహణకు రామగుండం నగరపాలక సంస్థ తరఫున డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్‌రావు బుధవారం 20 మంది కార్మికులను పంపించారు. శానిటరీ సూపర్‌వైజర్లు రాజబాబు, తిరుపతి, ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ వేములవాడలో పనులను పర్యవేక్షిస్తారని తెలిపారు.

శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ విజయవంతం చేయాలి

సుల్తానాబాద్: ప్రత్యేక శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి కోరారు. బుధవారం సుల్తానాబాద్ పట్టణంలోని 11వ వార్డులో మురికి కాలువలు, చెత్త ప్రాంతాలను పరిశీలించి, మాట్లాడారు. వెంటనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కాలనీలు శుభ్రంగా ఉండాలని, ప్రతిఒక్కరూ విధిగా తడి, పొడి చెత్తను వేరుచేసి, మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. కౌన్సిలర్ రేవెల్లి, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

'నారీశక్తిని ప్రపంచానికి చాటిన ప్రధాని మోదీ'

పెద్దపల్లిరూరల్: నారీశక్తిని ప్రపంచానికి చాటిన ఘనత ప్రధాని మోదీదేనని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శీలారి పర్వతాలు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లిలో ప్రధాని సందేశాన్ని మహిళలకు వర్చువల్‌గా వినిపించారు. నాయకులు సంతోష్, ఆదిరెడ్డి, సంపత్‌రావు, కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ తదితరులున్నారు.

ఇద్దరి నేత్రాలు సజీవం



రాజేశ్వరి (ఫైల్)

కమాన్‌పూర్: రొంపికుంటకు చెందిన కాశెట్టి రాజేశ్వరి(73) గోదావరిఖని జీజీహెచ్‌లో చికిత్స పొందు తూ మంగళవారం మృతిచెందింది. ఆమె కుమారులు రాము, శివ అంగీకారంతో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ లక్ష్మణ్‌కుమార్ రాజేశ్వరి నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌కు తరలించారు. మృతురాలి కుటుంబసభ్యులను సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, కమాన్‌పూర్ లైయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అభినందించారు.



రాజిరెడ్డి (ఫైల్)

కోల్‌సిటీ: గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన చెరుకు రాజిరెడ్డి (58) అనే సింగరేణి మాజీ కార్మికుడు బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రావడంతో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ లక్ష్మణ్‌కుమార్ సేకరించి, హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి భార్య సరోజ, కొడుకు సురేష్ రెడ్డి, కూ తుళ్లు అనిత, సునీతలను ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ అభినందించారు.





ట్రిపుల్ రైడింగ్.. ఫోన్ టాకింగ్

రహదారి భద్రతా వారోత్సవాలు అంటూ ప్రమాదాలపై వాహనదారులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కానీ, మార్పు మాత్రం కనిపించడం లేదు. ప్రమాదాలు ట్రిపుల్ రైడింగ్, ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం వల్లే జరుగుతున్నాయని చూసేవారు చెబుతున్నారు. పెద్దపల్లి పట్టణంలో బుధవారం ఇలా ముగ్గురు, ముగ్గురు బైక్‌లపై వెళ్తూ, పలువురు ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ కనిపించారు. ఈ దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





'రైతు నేస్తం' సద్వినియోగం చేసుకోవాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: ఆధునిక సాంకేతికత పరిజ్ఞానం ద్వారా రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి రైతు వేదికలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం వీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు స్వరూప, తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు అనిత, డీఏవో ఆదిరెడ్డి, ఏవో, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రైతుల వేదికలో బుధవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్



వీసీలో ఎమ్మెల్యే విజయరమణారావు, డీఏవో ఆదిరెడ్డి తదితరులు

ప్రారంభ కార్యక్రమాన్ని అధికారులు, రైతులు వీక్షించారు. పంటల సాగు విధివిధానాలపై శాస్త్రవేత్తలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రవూఫ్‌ఖాన్, కేవీకే హెడ్ శ్రీనివాస్, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

పాలకుర్తి: ఆధునిక సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ శ్రీనాథ్ అన్నారు. బుధవారం పాలకుర్తి రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. అనంతరం రైతులకు భోజనం ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయాధికారి ప్రకాశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శివయ్య, జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, ధర్మారం ఏవో పూర్ణిమ, పాలకుర్తి ఎంపీపీ అనసూర్య, కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, ఎంపీవో షబ్బీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్లయినా సొంత భవనాల్లేవ్

- బీఆర్‌ఎస్ పాలనకు ఇది నిదర్శనం
- కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి
- సాదాసీదాగా పాలకుర్తి మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న విండో చైర్మన్ మనోహర్‌రెడ్డి

పాలకుర్తి: పాలకుర్తి మండల కేంద్రంగా ఏర్పాటై ఏడేళ్లయినా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాల్లేవని కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి అన్నారు. ఇది బీఆర్‌ఎస్ పాలనకు నిదర్శనమని విమర్శించారు. బుధవారం ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య అధ్యక్షతన పాలకుర్తి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడం, వచ్చిన వారు అరకొర సమాచారంతో రావడంపై ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని మండల కో–ఆప్షన్ సభ్యులు సర్వర్‌పాషా, పాలకుర్తి ఎంపీటీసీ సభ్యుడు దుర్గం కుమార్ ఆరోపించారు. స్పందించిన ఎంపీపీ ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉందని మండల వైద్యాధికారి సాయిసూర్య తెలిపారు. వాటిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఆయా గ్రామపంచాయతీల్లో ఉన్న నిధుల ఆధారంగా చర్యలు తీసుకోవాలని ఎంపీవో షబ్బీర్‌పాషా కోరారు.

'కేశోరాం' అధికారులకు నోటీసులిస్తాం..

కేశోరాం సిమెంట్ కర్మాగారం నుంచి విపరీతమైన కాలుష్యం వెలువడుతోందని మండల కో–ఆప్షన్ సభ్యుడు సర్వర్‌పాషా అన్నారు. దీనిపై ఎంపీడీవో శశికళ మాట్లాడుతూ.. కంపెనీ అధికారులను సర్వసభ్య సమావేశానికి రావాలని ముందస్తు సమాచారం ఇచ్చినా రాలేదని, వారికి నోటీసులిస్తామని తెలిపారు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించాలని వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ల సహకారంతో మండలం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందతుందని బయ్యపు మనోహర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేపట్టాలని, సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఆయన తీర్మా నం ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఆమోదించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ వంశీకృష్ణ, పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఏపీఎం సదానందం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయ, సువర్ణ, ఎంపీటీసీ సభ్యులు పాత భాగ్యలక్ష్మి, గంగాధర రమేశ్, బండారి శ్రీవాణి, సంతపూరి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ నియామకం

పాలకుర్తి: రాణాపూర్‌కు చెందిన ఎరుకల సాగర్ గౌడ్‌ను యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రటరీగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు జెమినిగౌడ్ తెలిపారు. బుధవారం పెద్దపల్లిలో జరిగిన పార్లమెంట్ స్థాయి సమావేశంలో ఆయనకు కాంగ్రెస్ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు చేతులమీదుగా నియామక పత్రం అందించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, ఇతర నాయకులకు సాగర్‌గౌడ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

'బాలసదనం' పనులకు శంకుస్థాపన

సుల్తానాబాద్: అనాథల సౌకర్యార్థం ప్రభుత్వం మిషన్ వాత్సల్య కార్యక్రమం చేపట్టిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని మార్కండేయ కాలనీలో రూ.1.34 కోట్లతో నిర్మించనున్న బాలసదనం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. 6 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలికలకు 8 గంటల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ పాఠశాల అందుబాటులోకి రానుందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కమిషనర్ వేణుమాధవ్, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కత్తెరశాల మల్లన్నకు ఎమ్మెల్యే పూజలు

ఓదెల: కనగర్తి గ్రామంలోని కత్తెరశాల మల్లన్న సన్నిధిలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు బుధవారం సాయంత్రం పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు చొప్పరి రాజయ్య, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీల నేతలతో అదనపు కలెక్టర్ సమీక్ష

రామగుండం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ గుర్తింపు పొందిన పార్టీల నేతలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పు చేర్పులు, బీఎల్వోల ఇంటింటి సర్వే, ఓటరు కార్డుల పంపిణీ తదితర అంశాలపై చర్చించారు.

బూత్ లెవల్ ఆఫీసర్లతో సమావేశం..

జ్యోతినగర్: రామగుండం నియోజకవర్గంలోని బూత్ లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతో ఎన్టీపీసీ మిలీనియం హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్ నమోదు, మార్పుచేర్పులు తదితర అంశాలపై చర్చించారు. సమావేశాల్లో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, రామగుండం, అంతర్గాం, పాలకుర్తి తహసీల్దార్లు కుమారస్వామి, రామ్మోహన్, జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్లు తిరుపతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు



కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి

గోదావరిఖనిటౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా అదనపు న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు పురుషులతో పోటీ పడుతున్నారని తెలిపారు. వారిని గౌరవించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ మహిళా న్యాయవాదులను సత్కరించారు. గోదావరిఖని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ దుర్వ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో...

గోదావరిఖని ఆర్టీసీ డిపోలో డీఎం నాగభూషణం ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ లక్ష్మీవాణి హాజరై, మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారని తెలిపారు. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల సేవలు అభినందనీయమన్నారు. ఆటలపోటీల్లో గెలిచిన మహిళా ఉద్యోగులు, సిబ్బందికి బహుమతి ప్రధానం చేశారు. ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ గీతాకృష్ణ, మెకానికల్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.సంధ్యారాణి, ఎస్‌టీఐ అమృత తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ: గోదావరిఖని జీజీహెచ్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. సూపరింటెండెంట్ దయాల్ సింగ్‌తో కలిసి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్ కేక్ కట్ చేశారు. మహిళలు దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కొత్తగా ఉద్యోగం పొందిన 250 మంది నర్సింగ్ స్టాఫ్‌కు బ్యాడ్జీలు అందజేశారు. ఆర్‌ఎంవోలు అరుణ, తిరుమలేష, ప్రొఫెసర్లు, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

గోదావరిఖని: దేశఖ్యాతిలో మహిళల పాత్ర కీలకమని రామగుండం బీజేపీ నాయకురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం గోదావరిఖనిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వేడుకలు నిర్వహించారు. ముందుగా ప్రధాని నరేంద్రమోదీ శక్తివందన్ కార్యక్రమాన్ని వీక్షించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. నాయకులు హనుమంతుగౌడ్, రాంచందర్ తదితరులున్నారు.

మంథని: మంథని మండల సమాఖ్య కార్యాలయంలో నాబార్డ్ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్.జయప్రకాశ్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా రాణించినప్పుడే సమాజం బాగుపడుతుందన్నారు. మాతాశిశు ఆస్పత్రి వైద్యురాలు స్రవంతి, న్యాయవాది షబానా తదితరులున్నారు.

రామగుండం: అంతర్గాం మండలంలోని ముర్మూర్ ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం, వైద్య సిబ్బందికి సన్మానం చేశారు. అనంతరం కేంద్రంలోని చిన్నారులకు క్రీడాపోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. టీచర్ విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

లహరీ ఏసీ స్లీపర్ బస్సుల్లో 10 శాతం రాయితీ

గోదావరిఖనిటౌన్: సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు లహరీ ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సుల్లో 10శాతం రాయితీ ప్రకటించినట్లు గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. ఈ డిస్కౌంట్ ఏప్రిల్ 30వ తేదీ వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అమలు చేయాలి

మంథని: ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మంథనిలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, పోతిరెడ్డి కిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తగరం సుమలత తదితరులున్నారు.

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అమలు చేసేదాకా ప్రజల తరఫున ప్రశ్నిస్తామన్నారు. కార్పొరేటర్లు కృష్ణవేణి, కవిత సరోజిని, నాయకులు పాల్గొన్నారు.

'టెండర్లు మాకే ఇప్పించండి'

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థకు టీయూఎఫ్ఐడీసీ ద్వారా మంజూరైన రూ.100 కోట్ల పనులకు సంబంధించిన టెండర్లు తమకే ఇప్పించాలని కాంట్రాక్టర్లు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. టెండర్లు పిలవడానికి ప్రణాళికలు చేస్తున్నారని తెలిసిందని, అలా చేస్తే స్థానికంగా ఉన్న కాంట్రాక్టర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

బుర్ర కొండయ్య కుటుంబానికి పరామర్శ

ఎలిగేడు: సీపీఐ నేత బుర్ర కొండయ్యగౌడ్ మంగళవారం మృతిచెందగా ఆయన కుటుంబభ్యులను 303 డిస్ట్రిక్ట్ వరంగల్ వాకర్స్ అసోసియేషన్ రీజియన్ కౌన్సిలర్ కుమారస్వామి, గవర్నర్ ఎల్లయ్యగౌడ్, ఎలక్టెడ్ గవర్నర్ భారతి, ట్రెజరర్ రాజు బుధవారం పరామర్శించారు. ఆయన బడు గు, బలహీన వర్గాల కోసం పోరాటం చేశారని కొనియాడారు.

జర్నలిస్టులను దుర్భాషలాడిన నాయకుడిపై చర్య తీసుకోవాలి

పెద్దపల్లిరూరల్: జర్నలిస్టులను దుర్భాషలాడుతూ సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేసిన దళిత నాయకుడిపై చర్య తీసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం పెద్దపల్లి ఎస్సై మల్లేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న జిల్లా కేంద్రంలో మాదిగ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన డప్పు చాటింపు వార్తను బాగా కవర్ చేయలేదన్న అక్కసుతో అదే సామాజిక వర్గానికి చెందిన కాంపెల్లి ప్రభాకర్ జర్నలిస్టులను దుర్భాషలాడుతూ మాదిగ చైతన్య వేదిక వాట్సాప్ గ్రూపులో పోస్టు పెట్టాడని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సంపత్ కుమార్, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, పెద్దపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చంద్రమొగిలి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కమాన్‌పూర్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని తహసీల్దార్ ఆరిఫొద్దీన్ అన్నారు. రొంపికుంటలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమేశ్, మాజీ సర్పంచ్ రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మల్లన్న బోనాలు, పట్నాలు

జూలపల్లి: పెద్దాపూర్, తెలుకుంట గ్రామాల్లో బుధవారం శ్రీ మల్లికార్జున స్వామి బోనాలు, పట్నాల మహోత్సవం నిర్వహించారు. తెలుకుంటలో రామాలయ ప్రథమ వార్షికోత్సవం జరిపారు. భక్తులకు అన్నదానం చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

జూలపల్లి: కుమ్మరికుంట డీ–83 కెనాల్ ప్రదేశంలో బుధవారం పేకాడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,500, 4 బైక్‌లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల బెడద తీర్చాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ 24వ డివిజన్‌లో కుక్కల బెడద తీర్చాలని కార్పొరేటర్ కొలిపాక సుజాత కోరారు. ఈ మేరకు కమిషనర్ శ్రీకాంత్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. చిన్న పిల్లలు, మహిళలు రోడ్డుపై నడవాలంటే భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'ఆదర్శ'లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

రామగుండం: 2024–25 విద్యాసంవత్సరానికి గానూ ఆదర్శ విద్యాలయంలో 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 11 వరకు పొడిగించినట్లు లింగాపూర్ ఆదర్శ విద్యాలయం ప్రిన్సిపాల్ సారాతస్నీమ్ తెలిపారు. ఆరోతరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతిలో ఖాళీ అయ్యే సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమయపాలన పాటించని వైన్స్‌పై ఫిర్యాదు

మంథని: పట్టణంలో సమయపాలన పాటించకుండా నడుపుతున్న వైన్స్‌పై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గణేశ్ కోరారు. బుధవారం ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేశామన్నారు. మంగళవారం రాత్రి 10 గంటలు దాటినా మద్యం విక్రయాలు చేశారని ఆరోపించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంథని: స్థానిక విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో గురువారం ఉదయం 6.30 గంటల నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈఈ మల్లయ్య తెలిపారు. ఉప కేంద్రం అత్యవసర మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి: సెంటనరీకాలనీ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 19 నుంచి బీ జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సంబంధిత పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. రామగుండం రీజియన్ పరిధిలో క్రికెట్ ఆడే సింగరేణి అధికారులు, కళాశాలకు చెందిన పూర్వ క్రికెటర్ల ఆర్థిక సహాయంతో పోటీలు జరపనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ జీరో బిల్లు అందజేత

ధర్మారం: గృహజ్యోతి పథకంలో భాగంగా కొత్తూరులో విద్యుత్ జీరో బిల్లును అధికారులు బుధవారం ఎంపీటీసీ సభ్యురాలు భద్రమ్మ చేతులమీదుగా లబ్ధిదారులకు అందించారు. ధర్మారం సబ్‌స్టేషన్ ఏఈ ఖాసీం, సిబ్బంది ఉన్నారు.

నేడు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

రామగుండం: అంతర్గాం మండలంలోని పెద్దంపేటలో గురువారం గేదెలు, ఆవులు, ఎద్దులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ బీఆర్‌ఎస్ నాయకుడి మృతి



గోపాల్ (ఫైల్)

జ్యోతినగర్: బీఆర్‌ఎస్ నాయకుడు సుద్దాల గోపాల్(40) మృతిచెందారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం చనిపోయారు. బీఆర్‌ఎస్ నాయకులు, ఇందిరమ్మ కాలనీవాసులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కాల్వశ్రీరాంపూర్‌లో మహిళ..

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన నిమ్మల ఓదెమ్మ(56) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం ఇల్లు శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో తలకు బలమైన గాయాలైనట్లు పేర్కొన్నారు.

వృద్ధాప్య కారణాలతో ఒకరు..

మంగపేట మాజీ సర్పంచ్ బుర్ర సదానందం గౌడ్ తల్లి మల్లమ్మ(80) వృద్ధాప్య కారణాలతో బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎంపీపీ సంపత్, మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, వ్యవసాయ కార్మికశాఖ జిల్లా కార్యదర్శి రాజేందర్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఉచిత నైపుణ్య శిక్షణ వినియోగించుకోవాలి

రామగిరి/గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలో నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్య అభివృద్ధి, వృత్తి శిక్షణ కోర్సులను వినియోగించుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ, ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు అన్నారు. కాస్మోటాలజీ(మహిళలకు మాత్రమే), డ్రోన్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాస్మోటాలజీ కోర్సుకు ఎలాంటి విద్యార్హత లేదని, మిగతా వాటికి డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, పదోతరగతి పాసై ఉండాలని పేర్కొన్నారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలకు చెందిన 18 నుంచి 42 ఏళ్ల వయసువారు తమ సమీపంలోని ఎంవీటీసీలో ఈ నెల 15లోపు దరఖాస్తు అందజేయాలని సూచించారు.

వ్యక్తిగత ఆరోపణలు చేస్తే కఠినచర్యలు



కమాన్‌పూర్ ఠాణాలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏసీపీ రమేశ్

కమాన్‌పూర్: సోషల్ మీడియాలో వ్యక్తిగత ఆరోపణలు చేసేవారితోపాటు గ్రూపు అడ్మిన్‌లపై కఠినచర్యలు తీసుకుంటామని గోదావరిఖని ఏసీపీ రమేశ్ హెచ్చరించారు. కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్సై చంద్రశేఖర్‌ను ఆదేశించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి వినియోగించినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జ్యోతినగర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్ ట్రినిటీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు, సిబ్బందికి సైబర్ నేరాలు జరిగే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎవరైనా తమ ఖాతా నుంచి డబ్బులు పోగొట్టుకున్నట్లయితే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ యుగంధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మహమ్మద్ తాజుద్దీన్, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో వాటర్ డిస్పెన్సర్ ప్రారంభం



ధర్మారం: నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో వాటర్ డిస్పెన్సర్‌ను జడ్జి వెంకట్ సచిన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. కక్షిదారుల కోసం దీన్ని ఏర్పాటు చేసిన బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకారి రాజేశంను ఆయన అభినందించారు. ఈ డిస్పెన్సర్ వల్ల వేసవికాలంలో కక్షిదారుల దాహార్తి తీరుతుందని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు నార అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బొట్ల లక్ష్మీనర్సయ్య, కోశాధికారి ఎంపెల్లి ప్రకాశ్, సంయుక్త కార్యదర్శి నూనె సత్యనారాయణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఉన్నారు.